
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 31 డిసెంబర్ 2022



శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్



ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని తమిళనాడు రాష్ట్ర గవర్నర్ అర్.ఎన్.రవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్ధప్రసాదాలను గవర్నర్ దంపతులకు అందజేశారు. దర్శనం అనంతరం అర్.ఎన్.రవి దంపతులు వెంకమాంబ అన్నదాన భవనంలో అన్నప్రసాదాలను స్వీకరించారు.

పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లాలో అత్యధికంగా ఉన్న పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చిత్తూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రెండవ రోజు జరిగిన రైతు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో పాల రైతులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని వారిని దోచుకుంటున్న డెయిరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వివిధ రకాల పంటలు, తోటలు రైతులు



పండించిన వాటికి గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు రైతుల నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు నిజమైన వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వంలో ఎలాంటి సహాయం చేయడం లేదని తెలిపారు జిల్లాలో అత్యధికంగా వ్యవసాయం పై ఆధారపడి పనిచేస్తున్న రైతాంగానికి మోటార్లకు మీటర్లు పెట్టే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.


రైతు సంఘం నూతన కమిటీ ఏర్పాటు

అధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా శంకరన్, కమిటీ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, నాగరాజు, వెంకటేష్ నాయుడు, సుబ్రహ్మణ్యం లతోపాటు పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు : ఎంపి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఎస్.సి, ఎస్.టి ల సమస్యలకు పరిష్కారం చూపే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఎస్.సి/ఎస్.టి అత్యాచార నిరోధక చట్టం అమలు పై జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. డి.ఆర్.ఓ ఎన్ రాజశేఖర్, జెడ్పీ వైస్ చైర్మెన్ రమ్య, సంబందిత జిల్లా అధికారులు డి.వి.ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంపి మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టిలు వారి సమస్యలను అధికారులకు నివేదించినప్పుడు వారికి సంతప్తకర స్థాయిలో పరిష్కారం చూపాలని తెలిపారు. ఇందుకు రెవిన్యూ, పోలీస్, తదితర శాఖలు కషి చేయాలని తెలిపారు. జిల్లాలో భూ పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు మేరకు నియోజకవర్గాల వారీగా సంబంధిత ప్రజాప్రతినిధుల ఆమోదముతో అర్హులైన వారందరికీ భూ పంపిణీ కింద పట్టాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 1500 ఎకరాలను తాసీల్దార్ పరిశీలించి పంపిణీ చేయుటకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ ల సంక్షేమనికి అన్ని చర్యలు చేపడుతోందని డివిజన్, మండల స్థాయిలో ఈ సమావేశాలను



దళిత స్మశాన వాటికల ఏర్పాటుపై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎంపి రెడ్డప్ప

విధిగా నిర్వహించాలని కోరారు.గత ఆగస్ట్ 16 నిర్వహించిన సమావేశంలో సభ్యులు లేవనెత్తిన 5 కేసులు కు సంబంధించిన వివరాలతో పాటు తీసుకొన్న చర్యలు గురించి సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి రాజ్యలక్ష్మి కేసులకు సంబంధించి తీసుకున్న చర్యలు చదివి వినిపించారు. జిల్లాలో పోలీసు కేసులకు సంబంధించి నివేదికను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని చిత్తూరు డి.ఎస్.పి శ్రీనివాస్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు రేణుక, శివయ్య, సజన, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్,డి.ఆర్.డి.ఏ. పిడిలు పద్మనాభం, తులసి,పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్ రావ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి పాల్గొన్నారు.

దళివాడల స్మశానవాటిక జీవో హర్షణీయం : ఎంపి

చిత్తూరుఅర్బన్: దళితవాడలకు సంబంధించి స్మశానాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షనీయమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్. రెడ్డప్ప అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ను చిత్తూరు పార్లమెంట్ సభ్యులు కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఎంతో మంది హర్షం వ్యక్తం చేస్తున్నారని, స్మశాన వాటిక లకు దారి సమస్య లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు.

మాతా శిశుఆరోగ్యంపై విదేశీ ప్రశంసలు

చిత్తూరుఅర్బన్: మాతా శిశు, గర్భిణీ స్త్రీల లో ఆరోగ్యపరమైన సమస్యలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కషిని ఇతర దేశాలలో గర్వంగా చెప్పడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విదేశీ వైద్య సలహాదారు డాక్టర్ ఎన్. వాసుదేవ రెడ్డి అన్నారు. విదేశీ వైద్య సలహాదారుశుక్రవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో ఆరోగ్యవంతమైన ఆహారం ఇవ్వడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా క్షేత్రస్థాయిలో వైద్య సహాయం అందించబడుతోందని, గర్భిణీ స్త్రీలు శిశువులలో ఆరోగ్య సమస్యలు లేకుండా చూసేందుకు అంగన్వాడీ కేంద్రాలు చక్కగా పనిచేస్తున్నాయని విదేశాలలో తెలుగువారు ఎంతగానో గర్వంగా చెప్పుకోవడం జరుగుతుందని తెలిపారు. జనవరి మూడవ తేదీన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సదస్సును నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్రానికి చెందిన విదేశీ డాక్టర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. దశలవారీగా ఈ సదస్సును వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విదేశీ వైద్య సలహాదారు డాక్టర్ ఎన్ వాసుదేవ రెడ్డి తెలిపారు.



జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌తో చర్చిస్తున్న డాక్టర్ వాసుదేవరెడ్డి

జాతీయ స్థాయిలో బృందావన్ క్రీడాకారుల ప్రతిభ



ఫుట్‌బాల్ జాతతీయ స్థాయిలో విజేతలను అభినందిస్తున్న కరెస్పాండెంట్ శైలజకుమారి

చిత్తూరుఅర్బన్ : రాష్ట్ర మిని ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపి యూ - 11 కేటగిరీ నందు మాస్టర్ వై. చరణ్ కుమార్, కే. యశ్వంత్ లు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు బృందవన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ శైలజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయక్రీడా పోటీలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థులు ఈ నెల 26-29 తేదీల్లో డిసెంబర్ వరకు మహారాష్ట్ర లోని నాసిక్ నందు రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన్నట్లు తెలిపారు. క్రీడాకారులు ముంబై, తమిళ్ నాడు, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానాలతో జరిగిన మ్యాచ్ల నందు పాల్గొని, జట్టు విజయం నందు ఉత్తమ ప్రతిభ చూపి ఫైనల్‌లో గుజరాత్ పై 2-0 తేడాతో బంగారు పతకాలు సాధించారని కరెస్పాండంట్ శైలజ కుమారి తెలిపారు.. డైరెక్టర్ ప్రియ తేజ క్రీడాకారులను పిఈటి మురళి ని అభినందించారు.

సిడిపిఓపై చర్య తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

కుప్పం అంగన్వాడి ప్రాజెక్టు అధికారిని ఒకరోజు సెలవు పెట్టిన వర్కర్ లకు నెల జీతం కోత విధించడం దారుణమని వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్రన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కుప్పం ప్రాజెక్టులో అంగన్వాడీలను వేధిస్తున్న సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ ఎందుకు మీన వేషాలు వేస్తున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ కి ఇచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో సిడిపిఓ రెచ్చిపోతున్నారు. వర్కర్లు డిసెంబర్ నెలలో వారికి ఉన్న సెలవులను వాడుకోవడానికి రాతపూర్వకంగా ఒకరోజు సెలవు పెట్టి సూపర్ వైజర్‌కు ఇచ్చిన కక్ష్య సాధింపు చర్యలుగా నెల రోజులు వేతనాన్ని కట్ చేయడం దుర్మార్గమన్నారు. సెంటర్లకు విజిట్ వెళ్లకుండానే వేతనాలు కట్ చేస్తున్నారు. సిడిపిఓపై చర్య తీసుకోని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జోసఫ్ రాజుకు 2022 తానా పురస్కారం



తానా పురస్కారం అందుకుంటున్న జోసెఫ్‌రాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా చిత్తూరు జిల్లా ప్రవాస భారతీయుల సంఘం ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజు 2022 తానా పురస్కారం అందుకున్నారు. చిత్తూరు నగరం నాగయ్య కళాక్షేత్రంలో తానా కళోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజుకు తానా సేవ సంస్థ గౌరవ పురస్కారం 2022 అందించారు. ఈ సందర్భంగా జోసెఫ్ రాజ్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా చిత్తూరు జిల్లా ప్రవాస భారతీయుల సంఘం తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ తానా పురస్కారం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. జోసెఫ్ రాజు చేస్తున్న సేవా కార్యక్రమాలు నిరాశ్రయులకు, అభాగ్యులకు, పేదలకు మూడు పూటల భోజనం అందించి నూతన వస్త్రాలు, ఇవ్వడం క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం అందజేయడం, నిరాశ్రయులకు నిత్య వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, తానా చైతన్య స్రవంతి సమన్వయకర్త సునీల్ పం త్రా, ఆర్టిసి వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

న్యాయవాదుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం అనుబంధ న్యాయవాదుల సంఘం 2023 క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాల యం లో తెలుగుదేశం నాయకులు న్యాయవాధుల సంఘం నాయకులు ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగు దేశం విజయం కోసం పని చేయనున్నట్లు న్యాయ వాదుల సంఘం నాయకులు చంద్రశేఖర్ తెలిపారు.

వెంకన్న పూర్తి చరిత్రతో.. శ్రీనివాస కల్యాణం: సుబ్బరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ పరిషత్ తిరుపతి వారి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో జనవరి 2న సాయంత్రం పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు బంగారు నంది అవార్డు గ్రహీత కళాతపస్సు కోనేటి సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రశ్నలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటక పాత్రదారులతో కలిసి ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల ఆలయ గర్భగుడిని ప్రతిరోజు ఉదయం తెరచే గొల్లవాని పాత్రధారిగా కేశవులు యాదవ్, కుబేరుడుగా సాంబోల హరినాథ్, శ్రీనివాసునిగా చంద్రబాబునాయుడు, చూడ రాజుగా నాదముని రెడ్డి, కశ్యపుడిగా గోపాల్, వరాహుడుగా ఆమూరి సుబ్రహ్మణ్యం, వశిష్టుడిగా గోపాల్ రావు పాత్రలలో సీనియర్ స్టేజ్ ఆర్టిస్టులు నటించనున్నారన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల ప్రజలు ఎంతో శ్రమకోర్చి రూపొం దించిన ఈ పద్య నాటకాన్ని వీక్షించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



పెద్దిరెడ్డి 'పల్లెబాట'

చౌడేపల్లి : రాష్ట్రం లో జరుగుతున్న అభివద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలు చూసి సిఎం వైఎస్ జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ప్రజలు భావిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో ఏడు రోజుల పాటు పల్లెబాట కార్యక్రమం చేపట్టి 238 పల్లెలను పర్యటించి ప్రజా సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం చౌడేపల్లి మండలంలో తన రెండో రోజు పల్లెబాట చేపట్టారు. మండలంలోని అమినిగుంట, పందిళ్లపల్లి, శెట్టిపేట, పెద్దయల్లకుంట్ల,కాటిపేరి, కాగతి పంచాయతీల పరిధిలోని 40 పల్లెల్లో పర్యటించారు. మండలంలోని కాటిపేరిలో రెండు నూతన బస్సు సర్వీసులను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సర్వీసు రోజుకు రెండు సార్లు నడుపనున్నారు. దీంతో పాటుగా పుంగనూరు నుండి చదళ్ళ, కాటిపేరు, కాగతి మీదుగా బోయకొండ, నిమ్మనపల్లి కి పల్లెవెలుగు బస్సు సర్వీసు ప్రారంభించారు అగిస్తిగానిపల్లికి చెందిన టిడిపినేత, మాజీ ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు.

3న ఎస్వీయూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల్లో 2022 - 2023 విద్యా సంవత్సరానికి ఎం.ఏ, ఎం.కాం , ఎం.ఎస్.సి, ఎం.ఈడి తదితర పీజీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు జనవరి 3న సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని వర్శిటి రిజిస్ట్రార్ ఆచార్య ఓ. మహమ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఏపిపిజి సెట్ - 2022 లో ర్యాంకులు పొందిన విద్యార్థులు ఎం.ఏ, ఎం.కాం, ఎం.ఎస్.సి, ఎం.ఈడి తదితర పిజి కోర్సుల్లో చేరడానికి మొదటి, రెండవ విడత ఆడ్మిషన్లు జరిగాయని, కన్వీనర్ కోటాలో ఇప్పటివరకు సీటు పొందని విద్యార్థులకు స్పాట్ ఆడ్మిషన్లు జరుగుతాయని, ఎస్వీయూ పరిధిలోని పిజి కోర్సులలో కొన్ని కేటగిరిలలో సీట్లు మిగిలి ఉన్నందున వాటికోసం ఉన్నత విద్యామండలి ఆదేశాలతో స్పాట్ ఆడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఏపిపిజి సెట్ - 2022 లో ర్యాంక్ పొంది ఉంటే జనవరి 3 న ఉదయం 9 గంటలకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్ కార్యాలయాల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావాలని సూచించారు. ఏపిపిజి సెట్ - 2022 ర్యాంక్ పొందిన వారికి మెరిట్ ప్రాతిపదికన క్యాటగిరి వారిగా సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని, విద్యార్థులు సంబంధిత కోర్సులకు చెందిన డిగ్రీ అర్హత కలిగి ఉండాలని, సీట్ మ్యాట్రిక్స్ ఆధారంగా స్పాట్ ఆడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్శిటి వెబ్సైట్ ను సంప్రదించాలని కోరారు.

సైనిక నిధి విరాళానికి పన్ను రాయితీ

చిత్తూరుఅర్బన్: మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యుల సహాయార్థం సాయుధ దళాల పతాక నిధికి ఇచ్చిన విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు కలదని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ విజయ శంకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ విరాళాలను నేరుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గిమ్స్‌పేట అకౌంట్ నెంబర్ 62125384416 లో జమ చేయవచ్చని లేదా నేరుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో చెల్లించి రశీదు పొందగలరని ఆయన తెలియజేశారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఫోన్ నెంబర్ 8688817824 లేద 7382407242 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

27 నుంచి 'యువగళం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

చిత్తూరుఅర్బన్: 'యువగళం' పేరుతో టిడిపి జాతీయ నాయకులు నారా లోకేష్ వచ్చే ఏడాది జనవరి 27వ తేది నుండీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలుగుదేశం నాయకులు దొరబాబు, పులివర్తి నాని, కఠారి హేమలత, సురేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఏడాదికి లక్షలాది ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు. నేడు యువత ఉద్యోగాలు లేక ఉన్న ఉద్యోగాలు ఊడి మత్తుకు బానిసలుగా మారిపోతున్నారని, గంజాయి అంధ్రప్రదేశ్‌గా అధికారి పార్టీ మార్చేసిందని విమర్శంచారు. యువతలో చైతన్యం తీసుకొచ్చేలా నారా లోకేష్ పాదయాత్ర 400 రోజులు 4వేల కిలోమీటర్లు సాగనున్నట్లు చెప్పారు. అధికార పార్టీ పాదయాత్రను అడ్డుకోవాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు కోదండయాదవ్, మోహన్‌రాజ్, మేషక్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పౌరహక్కుల దినం



ప్రజాశక్తి-యాదమరి:

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను అధికారులు నేరుగా తెలుసుకుని సమస్య పరిష్కరించడం కోసమే పౌర హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తహసీల్దారు చిట్టిబాబు అన్నారు. శుక్రవారం 155 కమ్మపల్లి హరిజనవాడలో పౌరహక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పోలీసులు, రెవెన్యూ, అభివద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గ్రామంలోని సమస్యలు అధికారుల దష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో స్మశానం గ్రామం పక్కనే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్, ఏఎస్ఐ ఉమాపతి, సర్పంచ్ తులసిరెడ్డి, విలేజ్ రెవెన్యూ అధికారి యశ్వంత్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి ముత్తు, దళిత నాయకులు మురుగేష్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ సెక్రటరీ కోడిగుట్ట రవి, రమణ, ప్రజలు పాల్గొన్నారు.

ఎపిసిపిఎస్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఏపీ సిపిఎస్ ఉద్యోగులు సంఘం, తిరుపతి జిల్లా 2023 స్టిక్కర్ క్యాలెండర్ ఆవిష్కరణను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎస్ విధానం వలన ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నష్టాలను జాయింట్ కలెక్టర్ కు సిపిఎస్ ఉద్యోగులు తెలియజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జేసికి సిపిఎస్ ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీసిపిఎస్ ఉద్యోగులు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు రేగంటి. దేవానంద్, సహాధ్యక్షడు యువకిషోర్, ప్రధాన కార్యదర్శి పివి. సుబ్బారెడ్డి, సలహాదారు శ్రీనాధ్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్రాయులు, బాలాజీ, వైస్ ప్రెసిడెంట్ లు సతీష్, రాజశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శులు మళ్ళీశ్వరయ్య, ఆజ్మతుల్లా, సాయికిషోర్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

25 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఆరుగురు స్మగ్లర్ల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మూడు వేర్వేరు సంఘటనల్లో 25 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అరుగురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డిలకు చెందిన మూడు బృందాలు గురువారం కూంబింగ్ చేపట్టాయని ఒక బృందం వెదురుకుప్పం, కార్వేటినగరం తిందమండి అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న కొందరు తారసపడ్డారని, వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా, దుంగలను పడేసి పారిపోయారని అధికారులు తెలిపారు. అయితే కార్వేటినగరంకు చెందిన సి.మునస్వామిని పట్టుకోని 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో బృందం వెదురుకుప్పంలోని ఆళ్లమడుగు ప్రాంతంలో గోవర్ధన్ రెడ్డి తోటలో 10 ఎర్రచందనం దుంగలు కలిగి ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి దుంగలను స్వాధీనం చేసుకుని, పళ్లిపట్లుకు చెందిన కేసీ.భరత్ కుమార్, ఆళ్లమడుగుకు చెందిన కే.గోవర్ధన్ రెడ్డి, కేబీఆర్ పురంకు చెందిన పి.బాబులను అరెస్టు చేశామన్నారు. మూడవ బృందం రైల్వే కోడూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టగా దుంగలు మోసుకుని వస్తున్న కొందరిని చుట్టుముట్టే ప్రయత్నం చేశామని, వారు దుంగలు పడేసి పారిపోవడంతో ఇద్దరిని పట్టుగోగలిగామన్నారు. వీరిని రైల్వేకోడూరు మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన సి.శంకర్రెడ్డి, శ్రీకాళహస్తి మన్నవరంకు చెందిన బీ.గంగయ్యలుగా గుర్తించామన్నారు. వీరి నుంచి ఒక మోటార్ సైకిల్‌తో పాటు ఆ ప్రదేశంలో 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్ లో నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను జ్యుడిషియల్ రిమాండుకు తరలించామన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మహిళలకు టైలరింగ్ ఫ్యాషన్ పై శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలోని గ్రామీణ పేద మహిళలకు టైలరింగ్ ఫ్యాషన్ డిజైనింగ్‌పై వందరోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ (ఈషీఏల్) ఆపరేటింగ్ ఆఫీసర్ సురేష్ ఖండేల్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ మేరకు శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నెలకు 15వేల నుంచి 18 వేల రూపాయల వరకు సంపాదిస్తూ కుటుంబాన్ని ఆర్థికపరంగా అభివృద్ధి చేసుకోవచ్చ న్నారు. ఇప్పటికే ఎంతోమంది మహిళలు తమ సంస్థ ద్వారా శిక్షణ పొంది ఆర్థికంగా ఎదిగారన్నారు. దేశంలో మహిళా సాధికారత కల్పిస్తున్న ఏకైక సంస్థ ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ అని ఆయన పేర్కొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి యాదమరి: ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం యాదమరి మండలంలోని ఎర్రచేను గ్రామంలో 104 ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతినెలా చివరి గురువారం గ్రామానికి వైద్యులు, వైద్య సిబ్బంది బందం వైద్య సేవలు అందిస్తుందన్నారు. 67 రకాల మందులు రోగులకు అందిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుస్మిత, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్తలు రమాదేవి, భువనేశ్వరి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోనే నూతన సంవత్సర వేడుకలు



ప్రజాశక్తి-పులిచెర్ల: నూతన సంవత్సర వేడుకలు ఇళ్లలోనే జరుపుకోవాలని కల్లూరు సబ్ ఇన్‌స్పెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపైకి ప్రజలు గుంపులు గుంపులుగా చేరడం బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం బాణసంచా పేల్చడం వంటి వాటిని నిషేధించడమైందని.. రాత్రి సమయంలో తాగి వాహనాలు నడపడం, ఓవర్ స్పీడ్‌తో వాహనాలు నడపడం, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కి నడపడం చేయరాదన్నారు. అలా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమైన కూడలిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయనున్నట్లు సూచించారు. ఏఎస్ఐ రాజారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రషీద్, విశ్వనాథ్, ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనాథ్ , కానిస్టేబుళ్లు మురళీ, సురేష్, ఫైజుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో కొనసాగుతున్న అన్నదానం



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు అన్నా క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి శుక్రవారం నాటికి 80 రోజులు పూర్తయింది. వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ మండలాధ్యక్షుడు లోకనాథరెడ్డి తన కుమార్తె డాక్టర్ రామతులసి శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గంగాధరనెల్లూరు అన్నా క్యాంటీన్లో మొదటగా మాజీ సీఎం స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నేతలు పూజలు చేశారు. అనంతరం లోకనాథ్ రెడ్డి, గంగాధరనెల్లూరు టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్ శుక్రవారం అన్న క్యాంటీన్లో 150 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గిరిబాబురెడ్డి, జాన్, రాము, బుజ్జిబాబు, పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక లాభాలు



ప్రజాశక్తి-వి.కోట: టమోటా సాగు రైతులు మెలకువలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో మండల పరిధిలోని టమోటా రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టమోటో సాగు, సస్యరక్షణ పద్ధతులపై శాస్త్రవేత్త డాక్టర్ అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ డి .మధుసూదన రెడ్డి, చీని, సింగిల్ విండో ఛైర్మన్ దవనం భక్త, ఏపీ మాస్ ప్రాజెక్ట్ మేనేజర్ అమరేంద్ర, ఉద్యాన అధికారి లక్ష్మీ ప్రసూనతోపాటు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంతో రూ.2.29 లక్షల ఆదాయం



ప్రజాశక్తి-కార్వేటినగరం: అక్రమ సారా తరలిస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాల వేలంతో రూ. 2.29 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ద్విచక్రవాహనాల వేలం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీ.ఐ నాగరాజు, ఎస్.ఐలు జయశంకర్, భాస్కర్, సిబ్బంది పలువురు ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-యాదమరి: యాదమరి విద్యావనరుల కేంద్రంలో యాదమరి పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంఈవో రుక్మిణీ, కె.గొల్లపల్లె ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, జిల్లా సహాధ్యక్షులు షకీల్ అహ్మద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు విశ్వనాద్, తులసిప్రసాద్, నాయకులు హరికష్ణ కాంచన, మాధవీరత్నం, సుశీల, ఆనంద్ పిళ్లై, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, శోభ, రాధిక, మురళీబాబు, తులసీరాం, ఆరీష్ అహ్మద్ పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా గంగాధర నెల్లూరు



ప్రజాశక్తి-కార్వేటినగరం : మరో పులివెందులగా జీడీనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి దిశలో దూసుకుపోతోందని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. మాటతప్పని సీఎంగా చరిత్ర సష్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని దత్తకు తీసుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో పులివెందుల తరహాల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తున్నారన్నారు. 75 సంవత్సరాలుగా శ్మశానవాటికలు లేకుండా మగ్గుతున్న ఎస్సీ, ఎస్టీలకు ఆకర్షణీయమైన శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆమోదం తెలపడం.. ఎస్సీ, ఎస్టీలకు కొత్త సంవత్సరంతో పాటు సంక్రాతి వేడుకలు ముందే వచ్చినట్లుందన్నారు. అలాగే అభివద్ధిలో భాగంగా మండలంలో రూ.32 లక్షలతో డీఎం పురం, కార్వేటినగరం పెద్ద దళితవాడలో కమ్యూనిటీ భవనాలు నిర్మాణాలు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అలాగే గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉడమలకత్తి కల్వర్టుపై బ్రిడ్జి నిర్మాణానికి ఏ ప్రభుత్వం మంజూరు చేయని విధంగా రూ.27 కోట్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నియోజక వర్గం అభివద్ధికి రెండు కళ్లుగా ఉంటూ వస్తున్న మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిఒక్కరూ పార్టీ అభివృద్ధికి కలసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, కోప్షన్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, శేషాద్రి, పద్మనాభశెట్టి, శేఖర్‌రాజు, ధనరాజ్, పురుషోత్తంరాజు, గోపినాధ్, పురంధర్, లోకనాథం, ఆకులగోపి, దొరబాబు, రాజారాం, శోభన్‌బాబు, గాంధీ, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవినీతిపై టీడీపీ పోరాటం





ప్రజాశక్తి-యాదమరి: పేద ప్రజల నడ్డివిరుస్తున్న జగన్‌ను గద్దె దింపాలని.. వైసీపీ అవినీతిపై టీడీపీ పోరాటం చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వినాయకం గౌండర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని భూమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో 'ఇదేం ఖర్మ -మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మొరార్జీ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నేతలు గ్రామాల్లో పర్యటించి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న దుర్మార్గాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యను తెలుసుకుంటూ కరపత్రాలను పంచారు. 9261292612 నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తూ కార్యక్రమం చేపట్టారు. జొన్నవాళ్ళమిట్ట గ్రామంలో కందుకూరు నియోజకవర్గంలో జరిగిన తొక్కిసలాటలో మతి చెందిన ఎనిమిది మంది కార్యకర్తలకు సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి హేమగిరి, చిత్ర, యూనిట్ ఇన్‌ఛార్జి హేమయ్యానాయుడు, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వినాయక, మండల ఉపాధ్యక్షులు సుభాష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి అమరనాధనాయుడు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర రాయల్ నియోజకవర్గం బీసీసెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, మండల టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జిలు గోపి గౌడ్, లక్ష్మీపతి నాయుడు, పట్టాభి, మాజీ సర్పంచ్ బాలాజీ, యువత కార్యదర్శి ఈశ్వర్ ,మండల కార్యదర్శి తులసిరామ్ చౌదరి, ఎస్సీ సెల్ అధ్యక్షులు శివాజీ, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు మురుగేష్ యాదవ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునీర్, మండల రైతు అధ్యక్షుడు పీఎం వేణుగోపాల్ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలోని దళితుల సమావేశాన్ని శుక్రవారం టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి నాలుగు మండలాల్లోని దళిత నాయకులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ దళిత టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దళితులకు రాష్ట్రంలో టీడీపీలోనే న్యాయం జరిగిందని.. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దళితులకు అందడం లేదని..అలాగే న్యాయబద్ధంగా దళితులకు రావాల్సిన నిధులు ఇవ్వడం లేదన్నారు. దళిత నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు అభివద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజకుమార్, నాయకులు రామయ్య, నారాయణ, ఎల్లప్ప, నియోజకవర్గ దళిత నాయకులు పాల్గొన్నారు.

వినూత్న విద్యావిధానంతో విద్యార్థులకు బోధన



ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వం చేపడుతున్న నూతన విద్యావిధానంలోని వినూత్నమైన కార్యక్రమాలను ఆమలు చేయడంలో ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని ఎంఈవో విజయకుమార్ అన్నారు. శుక్రవారం యూటీఎఫ్ నాయకులు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా మహిళా కార్యదర్శి రూప, మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సీపీఎస్ జిల్లా కన్వీనర్ వెంకటేశులు, దొరైరాజ్, వేమయ్య, రాబర్ట్స్, జయశంకర్, ద్రాక్షాయణి, ఉమాశంకర్, జ్యోతి, నాధమునిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు



ప్రజాశక్తి-పుంగనూరు: మద్యం తాగి వాహనాలు నడపడంతో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగాయని..మద్యం తాగి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పుంగనూరు అర్బన్ సీఐ గంగిరెడ్డి తెలిపారు. స్థానిక అర్బన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 2022 సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు, నేరాలపై సమీక్షించారు. పుంగనూరు మండలం పట్టణ పరిధిలో ఎక్కువగా తాగి వాహనాలు నడపడం, అక్రమ మద్య రవాణాలో కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో జిల్లాలోని అత్యధికంగా పుంగనూరు ప్రాంతంలోనే జరిగిందన్నారు. రోడ్లపై భారీకేట్లు కూడా ఏర్పాటు చేశామని.. ఇప్పటివరకు 20 వేల ద్విచక్రవాహనాలపై కేసులు రాసి రూ.26 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ 31న యువత బైక్ రైడింగ్ వీధుల్లోకి రావడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . పిల్లల తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వడం చేయకూడదని హెచ్చరించారు.

రొంపిచెర్ల: డిసెంబర్ 31వ తేదీ రాత్రి, నూతన సంవత్సరం రోజున బైకుల్లో తిరగడం, మద్యం తాగి ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం, రోడ్డుపై గట్టిగా కేకలు వేస్తూ వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని రొంపిచెర్ల ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బంగారుపాళ్యం: నూతన సంవత్సర వేడుకలు బహిరంగ ప్రదేశాల్లో చేపట్టరాదని ఎస్సై మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు శనివారం రాత్రి వారి వారి ఇళ్లల్లోనే జరుపుకోవాలని సూచించారు.

పుంగనూరులో అరాచక పాలన



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో అరాచక పాలన జరుగుతోందని.. రాష్ట్ర బీసీ సంఘం నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్రయాదవ్ అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో సోమల మండలం నంజంపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ చేసిన దాడి సంఘటనపై శుక్రవారం తీవ్రంగా ఖండించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అతని అనుచరులు, రౌడీలు, గూండాలు టీడీపీ నాయకులపై దాడి చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసేలా ఉందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం సమాధి అయిందన్నారు. రామచంద్రారెడ్డి కనుసన్నుల్లో అధికారులు నడుచుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యక్రమం తప్ప..ఇతర కార్యక్రమాలు జరగకూడదని పోలీసులు, రెవెన్యూ అధికారులు కంకణం కట్టుకున్నట్లు ఉన్నారన్నారు. ఇది చాలా అంచకమైన చర్యని.. విషయాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి గ్రహించాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలు, అక్రమాలు దౌర్జన్యాలను అరికట్టకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇకనైనా స్పందించి సీఎం చర్యలు తీసుకోవాలని కోరారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలి





ప్రజాశక్తి-యాదమరి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న యువగళం కార్యక్రమానికి స్వచ్ఛందంగా పాల్గొని పాదయాత్రని విజయవంతం చేయాలని యాదమరి మండలం టీడీపీ మండల అధ్యక్షులు కె ఎస్ మొరార్జీ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో యాదమరి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబి గారు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్నాథ్ నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిత్రా, బీసీసెల్ అధ్యక్షుడు గోపి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునీర్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, మాజీ ఎంపీపీ రాజామణిక్యం, నాయకులు పాల్గొన్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండల పార్టీ కార్యాలయం ఆవరణలో లోకేష్ పాదయాత్ర యువగలం అనే పోస్టర్‌ను మండల పార్టీ అధ్యక్షులు .బాబునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. జనవరి 27 నుంచి కుప్పం నియోజకవర్గంలో ప్రారంభిస్తున్న యువగళం పాదయాత్ర 400 రోజులలో 4 వేల కిలోమీటర్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేయడం జరిగిందని.. యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బేటప్పనాయుడు, మాజీ పార్టీ అధ్యక్షులు హేమాంబర గౌడు, సర్పంచులు గోపాల్, ఎల్లప్ప, యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేష్, నాయకులు మంజునాథ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో యువగళం కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత నాయకులు మదన్ మోహన్, గిరిధర్ గోపాల్, లోకేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

హీరాబెన్ మృతికి నివాళి


ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాతృమూర్తి హీరాబెన్ అనారోగ్యంతో మృతిచెందడంతో అగరమంగళం గ్రామంలో శుక్రవారం ఫ్లెక్సీకి జిల్లా బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడు ఇడగట్టి సుధాకర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, నేతలు జ్యోతి, వినాయక, సందీప్ పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం చేపట్టాలి




ప్రజాశక్తి-వెదురుకుప్పం : ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పందించి మద్యపాన నిషేధం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని..ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని.. సీఎం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేసి మద్యపానాన్ని నిషేధించే బాధ్యత తీసుకోవాలని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణిత పాఠ్యాంశాలపై విద్యార్థుల కృషి



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గణిత పాఠ్యాంశాలపై విద్యార్థులు ప్రత్యేక కృషి చేయాలని.. గణితంలో దాగి ఉన్న నిష్పత్తులను వెలికి తీసేందుకే విద్యార్థులకు గణాంకాల కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు లలిత అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ జరిగింది. రాష్ట్రస్థాయి గణిత వారోత్సవాల్లో మంగళపల్లి విద్యార్థులు ప్రతిభ చూపడంతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తీర్థం విద్యార్థులు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తీర్థం ఉన్నత పాఠశాల విద్యార్థులు కళ్యాణ్, కుమార్ జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమ్మ తెలిపారు. పుత్తూరు మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన క్రీడాపోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు.

జనరల్ న్యూస్

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించండి



ప్రజాశక్తి-కార్వేటినగరం: క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కడప ఆర్జేడీ డాక్టర్ పి.బాబు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఎంపీపీ లతాబాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కడప రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బాబు మాట్లాడుతూ విద్యను అభ్యసించడానికి ఆర్థిక పరిస్థితులు అవరోధాలు కాదని, తాము చదువుకున్నప్పుడు అనేక ఆర్థిక ఇబ్బందులతోనే ఉన్నత లక్ష్యాలను సాధించామని గుర్తు చేశారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కళాశాలలో విద్యాభివద్ధికి చాలా ఉపకరణాలు ఉన్నాయని.. వాటిని ఉపయోగించుకుని విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలు సాధించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని వనరులను ఉపయోగించుకుని, గొప్పస్థాయికి చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపు నిచ్చారు. అధ్యాపకులు విద్యాప్రమాణాలను పెంపొందించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని..ఇందుకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎస్ విద్యావతి తెలిపారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా, మలేరియాతోపాటు విష జ్వరాలు అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఎక్కువగా గ్రామాల్లో నీటి నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సుధా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-యాదమరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని.. వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలన సీహెచ్‌వో లక్ష్మీ నారాయణ తెలిపారు. శుక్రవారం ఈ బీసీ కాలనీలో జరిగిన ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



ప్రజాశక్తి-యాదమరి: రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు వై చిట్టిబాబు కోరారు. గురువారం కష్ణంపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ జగనన్న భూ రక్ష పథకం కింద గ్రామంలో రీసర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. గ్రామంలో పొలాల సరిహద్దులు గుర్తించేటప్పుడు సర్వే సిబ్బంది ముందుగా సమాచారం తెలియజేస్తారని తెలిపారు. రైతుల సమక్షంలోనే సాగు చేస్తున్న భూముల హద్దులు విస్తీర్ణం గుర్తించడం జరుగుతుందన్నారు. రీ సర్వేలో రైతులను భాగస్వామ్యం చేసి వారి సమక్షంలోనే వారు అనుభవిస్తున్న భూములను సర్వే చేసి బౌండరీస్ గుర్తిస్తారని తెలిపారు. రీ సర్వేలో రైతుకు ఏదైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే రీసర్వే సిబ్బంది, అధికారులకు రైతులు తెలియజేయాలని తెలిపారు. ఆ భూమిపై ఆర్‌వోఆర్ రీసర్వే బౌండరీ చట్టానికి లోబడి అనుభవ దారులకు భూహక్కులు వారి భూములకు కూడా పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో యాదమరి ఎస్ఐ సుమన్, మండల సర్వేయర్ చిరంజీవి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు జ్ఞానశేఖర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని ఎం కొత్తూరు పంచాయతీ సర్పంచ్ చంద్రమౌళి ఆధ్వర్యంలో రామచంద్రం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి గోపాల్ గౌడు, వాలంటీర్లు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు చెత్తతోనే సంపద



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంచాయతీల్లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని.. దీంతో పంచాయతీలకు సంపద ఉంటుందని డీపీవో లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాజిపల్లిలోని వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నూర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కమ్మనపల్లి పంచాయతీ కస్తూరిబా బాలికల పాఠశాలలో శుక్రవారం ఎంపీపీ రెడ్డెప్ప ఎనిమిదో తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోహిణి, సోమరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.